ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

మంగళవారం 10 డిసెంబరు 2024



అనుభవ మంటపం గ్యాలరీలో సీఎం, డీసీఎం తదితరులు

శతాబ్ది ఉత్సవానికి 'గాంధీ భారత్' పేరు

1924లో మహాత్మాగాంధీ అధ్యక్షతన బెళగావిలో కాంగ్రెస్ సభ జరిగింది. శతాబ్ది ఉత్సవాన్ని గాంధీ భారత్ పేరిట నిర్వహించ దలిచారు. ఈమేరకు డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, బెళగావి పీరణవాడిలోని గాంధీభవనాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా సువర్ణసౌధ ప్రాంగణంలో గాంధీ భారత కార్యక్రమ లోగోను సీఎం లాంఛనంగా ఆవిష్కరించారు. స్పీకర్ యూటీ ఖాదర్‌తోపాటు డీసీఎం, మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గాంధీజీ జీవితమే పోరాటమని, స్వాతంత్ర్య ఉద్యమం గురించి విద్యార్థులు, యువతతోపాటు అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలలో దేశభక్తి, అహింస, ఆర్థిక అవగాహన, స్వరాజ్, అస్పృశ్యత వంటి అంశాలపై ప్రచారం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ పాల్గొన్నారు.



గాంధీ వందేళ్ల సభ లోగో ఆవిష్కరిస్తున్న సీఎం, డీసీఎం

అనుమతులు లేని మెడికల్‌షాపులపై చర్యలు



సభలో మంత్రులు మునియప్ప, దినేశ్ గుండూరావు

రాష్ట్రంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. పరిషత్‌లో సభ్యుడు గోవిందరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో 37, 130 మెడికల్ షాపులు ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 7 జనతా బజార్‌లు, 23 జనసంజీవిని కేంద్రాలు, 178 జన ఔషధి కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇటీవలే అనుమతి లేని 1245 మెడికల్ షాపులపై చర్యలు తీసుకున్నామని, 292 లైసెన్సులు రద్దు చేశామన్నారు. మెడికల్ షాపులలో మాదకద్రవ్యాల విక్రయంపై నిఘా ఉంటుందన్నారు. మార్కెట్‌లలో లభించే మందులపై నాణ్యతా పరీక్షలను డ్రగ్స్ కంట్రోలర్ అధికారులు నిరంతరంగా పర్యవేక్షిస్తుంటారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.



విద్యుద్దీపాల వెలుగులో సువర్ణసౌధ



స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలుపుతున్న బీజేపీ రెబల్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్

వాడీవేడీ..!

- తొలిరోజు శాసన సభలో రసాభాస
- వక్ఫ్ వివాదంపై చర్చకు ప్రతిపక్షాల పట్టు
- బసవణ్ణపై ఆరోపణలు.. కాంగ్రెస్ ఆగ్రహం
- రెండుగంటలపాటు సభ వాయిదా
- వక్ఫ్‌పై చర్చకు అనుమతితో కొనసాగింపు
- రతన్‌టాటాకు ఉభయసభల సంతాపం

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శీతాకాల శాసనసభ సమావేశాలు తొలిరోజునే అధికార, ప్రతిపక్షాలు వాడివేడిగా వ్యవహరించాయి. శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావి సువర్ణసౌధలో సోమవారం ప్రారంభమయ్యాయి. సభా వ్యవహారాలు ప్రారరంభమైన వెంటనే వక్ఫ్‌బోర్డు రైతులకు నోటీసులు జారీ చేసి వేలాదిమందికి కంటిమీద కునుకులేకుండా చేస్తోందని దేశంలోనే ఇదో తీవ్రమైన సమస్య అని చర్చకు అవకాశం ఇవ్వాలని బీజేపీ, జేడీఎస్ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. స్పీకర్ అంగీకరించకపోవడంతో బసనగౌడపాటిల్ యత్నాళ్ పోడియం ముందుకువెళ్లి నిరసనకు దిగారు. ప్రతిపక్షనేత అశోక్ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఇదే సమయంలో జగజ్యోతి బసవణ్ణ పట్ల బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సభ్యులు చర్చకు డిమాండ్ చేశారు. సభ గందరగోళం కావడంతో రెండుగంటలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత వక్ఫ్ వివాదంపై చర్చకు అవకాశం ఇస్తానని స్పీకర్ యూటీ ఖాదర్ ప్రకటించడంతో సభ సజావుగా సాగింది.

మాజీ సీఎంలకు స్థానాల కేటాయింపు

బెళగావి సువర్ణసౌధ శాసనసభలో మాజీ సీఎంలు కుమారస్వామి, బసవరాజ్ బొమ్మైలకు సీట్లు కేటాయించారు. వారు ఎంపీలుగా ఎన్నికైనవారు. ఆరునెలలుగా కుమారస్వామి కేంద్రమంత్రిగా వ్యవహరిస్తుండగా బసవరాజ్ బొమ్మై ఎంపీగా ఉన్నారు. అయినా శాసనసభలో వారికి సీట్లు కేటాయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

హైస్కూల్ టీచర్లకు రెండు నెలల్లో ఉద్యోగోన్నతులు

రాష్ట్రస్థాయిలో హైస్కూల్ టీచర్లకు 2025 ఫిబ్రవరిలోగా పదోన్నతులు కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప హామీ ఇచ్చారు. పరిషత్‌లో సభ్యుడు ఎస్‌వీ సంకనూరు లేవనెత్తిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 2013 వరకు పదోన్నతుల ప్రక్రియ ముగిసిందన్నారు. 2024 ఫిబ్రవరిలో ప్రాథమిక, హైస్కూల్ ఉపాధ్యాయులక కల్పించాల్సి ఉండేదన్నారు.

గెస్ట్ టీచర్లకు గౌరవవేతనం పెంపు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గెస్ట్ టీచర్లకు ఆర్థికశాఖ అనుమతులు పొంది గౌరవవేతనం పెంచుతామని మంత్రి మధుబంగారప్ప తెలిపారు. పరిషత్‌లో డాక్టర్ ధనంజయ్‌సర్జి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రూ.15వేల నుంచి రూ.16వేలకు పెంచాలనే ప్రతిపాదన ఉందని అయితే ఆర్థికశాఖ అనుమతులకోసం వేచి చూస్తున్నామన్నారు.

అక్రమ బీపీఎల్ కార్డుల తొలగింపునకు కార్యాచరణ

అక్రమంగా బీపీఎల్ కార్డులు పొందినవారిపై ప్రత్యేక కార్యాచరణ ఆరంభిచామని పౌర సరఫరాలశాఖ మంత్రి మునియప్ప ప్రకటించారు. జేడీఎస్ ఎమ్మెల్సీ తిప్పేస్వామి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రంలో 65-75శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. వీరికి అన్యాయం జరిగేందుకు అంగీకరించమన్నారు. అయితే ఆర్థికంగా స్థిరంగా ఉండి ఐటీ చెల్లించేవారు, నిబంధనలకు వ్యతిరేకంగా బీపీఎల్ కార్డులు పొంది ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైనవారికి బీపీఎల్ కార్డులు రద్దు చేసేది లేదన్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

శాసనసభ కలాపాల ఆరంభం రోజున ముగ్గురు కొత్త ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. సండూరు నుంచి గెలుపొందిన అన్నపూర్ణ తుకారాం, చన్నపట్టణ నుంచి గెలుపొందిన సీపీ యోగేశ్వర్‌లు దేవుడి పేరిట, శిగ్గావి ఎమ్మెల్యే పఠాన్ యాసిర్ అహ్మద్‌ఖాన్ తల్లిదండ్రులు, రాజ్యాంగం పేరిట ప్రమాణం చేశారు. స్పీకర్ యూటీ ఖాదర్ సభలో ప్రమాణాలు చేయించగా ఎమ్మెల్యే అన్నపూర్ణ భర్త, ఎంపీ తుకారాం మీడియా గ్యాలరీ నుంచి వీక్షించారు.

రతన్‌టాటాకు ఉభయసభల సంతాపం

శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగానే శాసనసభలో స్పీకర్ యూటీ ఖాదర్ సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవల కన్నుమూసిన ప్రముఖులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దేశంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్తగా రాణించిన రతన్‌టాటాకు సభ సంతాపం తెలిపింది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి మనోహర తహసీల్దార్, కేహెచ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు బసవరాజ్, లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి ముద్నాల్, కలబురగి సూఫీ సాధువు సయ్యద్ శహ ఖుస్రో హుసేనీలకు సంతాపం ప్రకటించారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, ప్రతిపక్షనేత అశోక్‌తోపాటు పలువురు సంతాపం తెలిపారు.సభాపతి బసవరాజ హొరట్టి సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులంతా సంతాపం తెలిపారు.

వక్ఫ్ భూములపై చర్చకు ప్రతిపక్షాల పట్టు



సభలోకి ప్రవేశిస్తున్న విజయేంద్ర, చలవాది నారాయణస్వామి

శాసనసభలో సంతాపతీర్మానం ముగియగానే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. అందుకు బీజేపీ సభ్యులు తొలుత వక్ఫ్ వివాదంపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో తరతరాలుగా సాగు చేసుకుంటూ వచ్చిన భూములకు కొత్తగా వక్ఫ్ ఆస్తులంటూ నోటీసులు జారీ చేస్తున్నారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. వాయిదా తీర్మానానికి అవకాశం ఇవ్వాలని కోరారు. సభాసంప్రదాయాలకు అనుగుణంగా ప్రశ్నోత్తరాల తర్వాత పరిశీలిస్తామన్నారు. కానీ ప్రతిపక్ష సభ్యులు అంగీకరించలేదు. బసనగౌడపాటిల్ యత్నాళ్ ఏకంగా స్పీకర్ పోడియం ముందుకువెళ్లి నిరసనకు దిగారు. ఇదే సందర్భంలోనే కాంగ్రెస్ సభ్యులు ప్రపంచానికి ఆదర్శం అనిపించిన జగజ్యోతి బసవణ్ణ పట్ల అనుచిత వ్యాఖ్యల అంశంపై చర్చకు పట్టుబట్టారు. సభ గందరగోళంగా మారడంతో రెండుగంటలపాటు వాయిదా వేశారు. మరోసారి మధ్యాహ్నం కలాపాలు ఆరంభం కాగా వక్ఫ్ వివాదంపై సమగ్ర చర్చకు అవకాశం ఇస్తానని స్పీకర్ హామీ ఇవ్వడంతో సభ జరిగింది.

అనుభవ మంటప తైలచిత్రాల ఆవిష్కరణ

12వ శతాబ్దంలో బసవణ్ణ సామాజిక విప్లవం కోరుతూ కులమతాలకు అతీతంగా సమసమాజ నిర్మాణం చేయాలని అనుభవమంటపాన్ని ఏర్పాటు చేశారని అందుకు సంబంధించిన తైలవర్ణ చిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నాయని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. సువర్ణసౌధ ప్రాంగణంలో తైలవర్ణ చిత్రాల గ్యాలరీని ఆవిష్కరించారు. ప్రతిపక్షనేత అశోక్ సహా పలువురు పాల్గొన్నారు. సువర్ణసౌధను విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు సువర్ణసౌధ గేటు వద్ద ఐదు గ్యారంటీల నమూనాలకు విద్యుత్ అలంకరణ ఆకర్షణీయం అనిపించేలా రూపొందించారు.



గ్యారెంటీ పథకాల నమూనాలకు విద్యుత్ సొబగులు

కందికి గిట్టుబాటు ధర కోసం కేంద్రాన్ని అడుగుతాం

కందిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్రప్రభుత్వానికి మరోసారి లేఖ రాస్తామని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి తెలిపారు. తిప్పణ్ణప్ప కమకనూరు అడిగిన ప్రశ్నకు మంత్రి వివరించారు.



డ్రైవర్ చేతిని కట్టేసిన రైతు సంఘం నాయకులు


తొలిరోజు నిరసనల హోరు

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల ఆరంభం తొలిరోజున కలాపాలే కాకుండా సువర్ణసౌధ ప్రాంగణంలో నిరసనల హోరు సాగింది. రైతులు వివిధ డిమాండ్లు కోరుతూ రాస్తారోకో చేశారు. పోలీసులు అన్నదాతలను అరెస్టు చేసి బస్సుల్లో ఇతర ప్రాంతాలకు తరలించే యత్నం చేశారు. నిరసనకు దిగిన రైతులు బస్సులో డ్రైవర్ చేతిని, స్టీరింగ్‌ను పచ్చటి కండువాలతో కట్టి నిరసన కొనసాగించారు. మరోవైపు మహామేళావ్‌కు అనుమతులు ఇవ్వకపోవడంపై ఎంఈఎస్ కార్యకర్తలు సువర్ణసౌధ ముట్టడికి ప్రయత్నించారు. పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సుమారు 50మంది సంభాజి సర్కిల్‌వైపు పరుగులుతీస్తూ వచ్చారు. బెళగావి, నిప్పాణి, కారవార, బీదర్, బాల్కిలను మహారాష్ట్రలో చేర్చాలని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. శివసేన కార్యకర్తలు మహామేళావ్ నిర్వహించాలని మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా ఉద్ధ‌శ్‌ఠాక్రే శివసేన వర్గం అధ్యక్షుడు విజయ్‌దేవనెతోపాటు పలువురు బెళగావిలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. సుమారు 80మంది దాకా శివసేన కార్యకర్తలు రాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరోవైపు పంచమసాలి లింగాయతలు మంగళవారం తలపెట్టిన నిరసనకు జిల్లా యంత్రాంగం అనుమతులు ఇవ్వలేదు.

కనీసం 10వేల ట్రాక్టర్లలో లక్షలాదిమంది తరలిరావాలని ప్రణాళికలు సిద్ధం చేసుకోగా జిల్లా అధికారి అనుమతులకు ససేమిరా అన్నారు. లక్షలాదిమంది సువర్ణసౌధ ప్రాంగణానికి చేరుకుంటే వివాదాలు జరిగే అవకాశం ఉందని, భద్రత కల్పించడం సాధ్యం కాదన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు యత్నాళ్ జిల్లా యంత్రాంగం తీరును తప్పుబట్టారు.



బెళగావి సరిహద్దులో శివసేన కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు



మేకెదాటు వద్ద కావేరి నది ప్రవాహం

మేకెదాటుకు అనుమతుల ఆలస్యం

- కేంద్ర పర్యావరణ అధికారులపై అసంతృప్తి

7



ఎల్లెల్సీలో లారీ

దోచేసి.. తోసేశారు..!

- తుంగభద్ర కాలువలో లారీ
- ఐరన్ చోరీ చేసి కాలువలోకి మళ్లించినట్లు అనుమానం

8

ప్రమాదవశాత్తు బావిలో పడి

తల్లీకుమారుడి మృతి



రాధమ్మ(ఫైల్)

ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డ కుమారుడిని కాపాడబోయి...కన్నతల్లీ నీటిలో మునిగింది. ఊపిరాడక తల్లీ కుమారుడు మృతి చెందడం ఆ కుటుంబానికి విషాదం మిగిల్చింది.

8



సంజు(ఫైల్)


పత్తా లేని పట్టా

- డిగ్రీ పూర్తయి మూడేళ్లయినా చేతికందని మార్క్స్‌కార్డులు
- ఉన్నత విద్య, ఉద్యోగాలకు తప్పని తిప్పలు

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టాల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. దేశంలోనే అత్యధిక విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యారాష్ట్రంగా పేరొందిన కర్ణాటకలో డిగ్రీ ముగిసి మూడేళ్లు పూర్తయినా మార్క్స్‌కార్డులు చేతికి అందకపోవడంతో విద్యార్థులు తంటాలు పడుతున్నారు. లక్షలాదిమంది విద్యార్థులు ఒరిజినల్ మార్క్స్ కార్డులకోసం ఎదురుచూస్తున్నారు. ఒరిజినల్ మార్క్స్ కార్డుల ద్వారా ఉన్నత విద్యకు ప్రొవిజినల్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ పూర్తి చేశాము... ఇక ఉద్యోగానికి వెళ్దామనుకునేవారికి దరఖాస్తులో సర్టిఫికెట్‌లను జత చేసే పరిస్థితి లేకుండా తంటాలు పడుతున్నారు. రాష్ట్రంలో 24 యూనివర్సిటీలకు సంబంధించి 3,500కుపైగా కళాశాలలకు చెందిన విద్యార్థులకు మూడేళ్లుగా మార్క్స్‌కార్డులు లభించలేదు. రాష్ట్రంలో యూనిఫైడ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ మేనేజిమెంట్ సిస్టమ్ (యూయూసీఎంఎస్) 2020-21 విద్యాసంవత్సరంలో ప్రారంభించారు. అన్ని యూనివర్సిటీల విద్యార్థులకు ఒకే విధానంతో మార్కులజాబితా విడుదల చేసేందుకు నిర్ణయించారు. అయితే సకాలంలో విద్యార్థులకు మార్కులజాబితా సిద్ధం చేయడం సాధ్యం కాకపోవడంతో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మార్కులజాబితా అందడం లేదు. ఇదే విషయమై యూనివర్సిటీలు కోరితే వారు యూయూసీఎంస్ పోర్టల్ ద్వారా పొందాలని సూచిస్తున్నారు.



యూయూసీఎంఎస్ వెబ్‌సైట్



మార్కుల జాబితా కీలకమైనది

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నతవిద్య లేదా ఉద్యోగంలో చేరేందుకు ఒరిజినల్ మార్క్స్‌కార్డులు అవసరం కానున్నాయి. ప్రస్తుతానికి నేషనల్ అకడమిక్ డిపాజిట్ డిజిలాకర్‌లో డిజిటల్ మార్కులజాబితాను పొందవచ్చునని యూనివర్సిటీలు పేర్కొంటున్నాయి. డిజిటల్ మార్కులజాబితాకు అటెస్టేషన్ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రైవేట్ కళాశాలలు, విదేశీ విద్యాసంస్థలు డిజిటల్ కాపీకి అటెస్టేషన్‌ను అంగీకరించడం లేదు. ఉద్యోగాలలో చేరేందుకు ఎంఎన్‌సీ కంపెనీలు తప్పనిసరిగా మార్కులకార్డులను కోరుతున్నాయి. ఇలా ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులకు, విద్య, ఉద్యోగాలవంటి కీలకమైన భవిష్యత్తు విషయంలో అన్యాయం జరుగుతోంది. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందేందుకు సాధ్యం కావడం లేదు. మరోవైపు డిజిటల్ మార్కులజాబితా ముద్రణలో పలు తప్పులు దొర్లుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



ఫార్మాట్ రూపకల్పనలో జాప్యం

ఉన్నత విద్యాశాఖ ప్రణాళికల నిర్వహణా విభాగం యూయూసీఎంఎస్ పోర్టల్ నిర్వహణను పర్యవేక్షిస్తోంది. రాష్ట్రంలో 24 యూనివర్సిటీలు, 3,500 కళాశాలలు ఈ పరిధిలోకి రానున్నాయి. 2021-22 విద్యాసంవత్సరంలో ఈ పోర్టల్ ద్వారా మార్కుల జాబితాను మంజూరు చేసేలాంటి నిర్ణయం తీసుకోవాల్సి ఉండేది. ఇందుకు సమగ్రమైన ప్రక్రియ అమలు చేయడం సాధ్యం కానందునే సమస్య తీవ్రమైంది. 2024 ఏప్రిల్‌లో మార్కులజాబితా ఎలా ఉండాలనేది ఫార్మాట్‌ను తీర్మానించారు. అప్పటివరకు 54లక్షల మార్కుల జాబితాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా అన్ని యూనివర్సిటీల డేటా సేకరించి మార్కుల జాబితాను క్రోడీకరించి పంపించే ప్రయత్నం చేస్తుండగా సర్వర్ సమస్య తీవ్రమైంది. ఇలా సాంకేతిక కారణాలతో విద్యార్థులకు డిగ్రీ పట్టాలు పొందలేకపోతున్నారు. ప్రస్తుతం లభిస్తున్న డిజిటల్ మార్కుల జాబితాకు గుర్తింపు లేకుండా పోతోంది. పీజీ, బీఈడీ కోర్సులో చేరేవారికి మాత్రమే సర్టిఫికెట్‌లను ఇస్తున్నారు. అయితే మూడేళ్ల మార్కుల జాబితా యూనివర్సిటీలోనే డౌన్‌లోడ్ కావడం లేదు. ఇదే విషయమై ఉన్నత విద్యాశాఖకు వివరణ కోరినా యూయూసీఎంస్ ద్వారా కొత్త సమస్యలు వస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. మార్కులజాబితాను వెంటనే విద్యార్థులకు అందించాలని గవర్నర్ 2022లో ఆదేశించినా అమలు కావడం లేదు. మార్కులజాబితా పేరిట కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి.

'బ్లాక్'లో అమ్ముకున్నారు..!

- కౌన్సెలింగ్‌లో ఇంజనీరింగ్ సీట్ల బ్లాక్...
- మూడు కళాశాలలకు నోటీసులు



బెంగళూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల బ్లాకింగ్ దందాకు సంబంధించి విచారణకు హాజరు కావాలని మల్లేశ్వరం పోలీసులు మూడు కళాశాలల యాజమాన్యంకు సోమవారం నోటీసులు జారీ చేశారు. న్యూ హారిజన్ స్కూల్ ఆఫ్ ఇండియా, బీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాల, ఆకాశ్ ఇంజనీరింగ్ కళాశాలలకు నోటీసులు జారీ చేశారు. విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని నోటీసులలో స్పష్టం చేశారు. కర్ణాటక ఎగ్జామినేషన్ అథారిటీ (కేఈఏ) పాలనాధికారి సాలుద్దీన్ జె గాడియన్ ఫిర్యాదు మేరకు అథారిటీ ఉద్యోగి అవినాశ్ సహా పదిమందిని మల్లేశ్వరం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అవినాశ్ సహకారంతో సీట్లను అక్రమంగా డీల్ చేసి లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. కేఈఏ కౌన్సెలింగ్‌కు హాజరై కళాశాలను ఎంపిక చేసుకోకుండా ఉండే వారిని నిందితులుగా గుర్తించారు. ఇలా వివిధ కారణాలతో 2,625 మంది విద్యార్థుల సీట్లను తిరస్కరించారు. అవినాశ్ సహకారంతో అథారిటీ పాస్‌వర్డ్ ద్వారా ప్రభుత్వ కోటాలో సీటు పొంది కళాశాలను ఎంపిక చేసుకోకుండా సీట్లు బ్లాక్ చేశారు. ఇవే సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో ఇతరులకు లక్షలాది రూపాయలకు అమ్మేటా డీల్ చేశారు. నిందితులలో ఒకరైన ప్రకాశ్ కేసు నమోదైన విషయం తెలిసిన వెంటనే స్వగ్రామమైన కడూరులోని పొలంలో ల్యాప్‌టాప్‌లకు నిప్పుపెట్టి కాల్చేశాడు. ఈ కేసులో పట్టుబడినవారిలో హర్ష, ప్రకాశ్, రవిశంకర్ పునీత్, శశికుమార్, పురుషోత్తమ్, అవినాశ్ సహా మరొకరు ఉన్నారు. విచారణలో మూడు కళాశాలల పేర్లు ప్రస్తావించిన మేరకు నోటీసులు జారీ చేశారు.

మూడు ముక్కలాట..!


సాగవుతున్న మల్బరీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్(వీఎస్ఏ)లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, సచివాలయ ఉద్యోగాల భర్తీలో భాగంగా వీఎస్ఏలను నియమించారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీల్లో సెరికల్చర్ చదివినవారిని అర్హులుగా నోటిఫికేషన్‌లో పేర్కొ న్నారు. నియామకం సందర్భంగా పట్టుపరిశ్రమ శాఖలో టెక్నికల్ ఉద్యోగమని చెప్పారు. అయితే వారిని మూడుశాఖలకు ముడిపెట్టారు. వీరి ఉద్యోగం పట్టు పరిశ్రమ శాఖలో.. పర్యవేక్షణ మాత్రం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌ది. జీతాలు ఇచ్చేది పంచాయతీరాజ్ శాఖ. ఇలా మూడు ముక్కలాటల తమ ఉద్యోగం ఉందని పలువురు వీఎస్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెరికల్చర్ పనులు కాకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ సంబంధిత పనులు చేయడం. ఏపీ ఎంఐపీ, మార్కెటింగ్ చేయించడం. క్రాప్‌బుకింగ్, విత్తనాలు, ఎరువులు అమ్మడం తదితర పనులకు గత ఐదేళ్లుగా పరిమితం

ఎరువుల అమ్మకానికి పీహెచ్‌డీనా..?

ఉమ్మడి జిల్లాలోని 150 వీఎస్ఏల్లో చాలామంది సెరికల్చర్ కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీలు చేశారు. విద్యాభ్యాసంలో భాగంగా మల్బరీ పంటపై అనేక ప్రాజెక్టులు చేశారు. సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన మల్బరీ ఆకును పండించవచ్చు. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టు పురుగులు మేలురకమైన గూళ్లను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా రైతులకు అధిక ఫలసాయం దక్కుతుంది. పంటసాగులో, పట్టుగూళ్ల ఉత్పత్తి సమయంలో వ్యాధుల నివారణకు అవసరమైన కొత్త సాంకేతిక పద్ధతులు అవలంబించాలి. చంద్రికల నుంచి పట్టుగూళ్లను వేరుచేసి మార్కెట్‌కు తరలించేవరకు కకూన్‌లు సహజసిద్ధమైన నాణ్యత కోల్పోకూడదు. ఇలాంటివాటిపై పరిశోధన చేసిన తమతో పట్టు రైతులకు ఉపయోగపడే పనులు కాకుండా ఐదేళ్ల నుంచి ఎరువులు, విత్తనాలు అమ్మిస్తున్నారని వీఎస్‌లు వాపోతున్నారు. వీటికోసం సెరికల్చర్‌లో పీజీలు, పీహెచ్‌డీలు చేయాలా? అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చేశారని పేర్కొన్నారు. వీఎస్ఏలుగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా పట్టు రైతులకు ఎలాంటి సేవలు అందించాలో సెరికల్చర్ ఆఫ్ కమిషనరేట్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేటాయించిన విధులు నిర్వహించేందుకే వీఎస్ఏల ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు 2019 జూలై 17న 631 జీఓను జారీ చేసింది. అయినా గత ప్రభుత్వం వాటిని విస్మరించిందని వాపోతున్నారు.

- మూడు శాఖల మధ్య నలుగుతున్న వీఎస్ఏలు
- గతంలో ఎరువులు, విత్తనాల అమ్మకం పనులు
- మాతృశాఖలో విలీనం చేయాలని వేడుకోలు
- సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి

వీఎస్ఏలు నిర్వహించాల్సిన విధులు

- సెరికల్చర్ కార్యకలాపాలు చేపట్టేందుకు రైతులను గుర్తించడం.
- మట్టినమూనాలు సేకరించడం, భూసార పరీక్షల రికార్డులను నిర్వహించడం.
- మల్బరీ ప్లాంటేషన్ చేపట్టేందుకు రైతులకు సాంకేతిక మార్గదర్శకం చేయడం, అందుకు అవసరమైన పరికరాలను అమర్చడం.
- పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి కావాల్సిన పెంపక పరికరాలను అందజేసి సూచనలు చేయడం.
- వ్యాధుల్లేని పట్టుపురుగు గుడ్ల సరఫరా కోసం రాష్ట్ర, కేంద్ర పట్టు పురుగు విత్తనోత్పత్తి కేంద్రాలు, గ్రెయినేజీలతో సమన్వయం చేసుకోవడం.
- రైతులకు పట్టుపురుగుల పెంపకం, కకూన్ మార్కెటింగ్ కోసం సాంకేతిక మార్గదర్శకత్వం చేయడం.
- మల్బరీ, సిల్క్‌వార్మ్ వ్యాధులు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్‌మేనేజ్‌మెంట్ నివారణ, నియంత్రణపై అవగాహన కల్పించడం.
- మల్బరీ గార్డెన్ నిర్వహణలో సేంద్రియ, సహజ వ్యవసాయంపై అవగాహన కల్పించడం.
- రైతులకు మేలు చేసేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం.
- సెరికల్చర్ యూనిట్లు తీసుకోవడానికి రైతులకు బ్యాంకు రుణాలను అందించడం.
- రైతుల డేటా డాక్యుమెంటేషన్‌ను నిర్వహించడం.
- శిక్షణలు, వర్క్‌షాపులు నిర్వహించడం. ఫీల్డ్ విజిట్‌లు చేసి తగిన సాంకేతిక సలహాలివ్వడం.
- సెరికల్చర్ ఆఫీసర్(ఎస్ఓ), అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్(ఏఎస్ఓ)ల పరిధిలో ఆయా మండలాల్లో సేవలందించడం.
- ఎస్ఓ, ఏఎస్ఓలకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలి.
- ఎప్పటికప్పుడు ప్రభుత్వం అప్పగించిన అన్ని ఇతర పనులకు హాజరుకావాలి.

మూడుశాఖలు, ముప్పుతిప్పలు

పట్టుపరిశ్రమ శాఖలో పనిచేసేందుకు నియమించిన వీఎస్ఏలు మూడుశాఖలకు అనుబంధంగా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరింది సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో అయితే పర్యవేక్షించేంది అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్. జీతాలు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లిస్తున్నారు. ఇలా మూడు శాఖల మధ్య ముప్పుతిప్పలు పడుతున్నామని వీఎస్ఏలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీఎస్ఏలు విధులకు హాజరయ్యే రైతు సేవాకేంద్రాలకు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. సెలవు కావాలంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన అనుమతిస్తే లీవ్‌లెటర్ సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్తుంది. ఈ నేపథ్యంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మాతృశాఖ అయిన పట్టు పరిశ్రమ శాఖలో విలీనం చేస్తే ఎవరు, ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో సమాచారం ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఉద్యోగాలు సక్రమంగా నిర్వహించేందుకు వీలుంటుందని వారు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని గత ప్రభుత్వంలో విన్నవించినా, లేఖలు అందజేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

సందిట్లో సడేమియా

మూడుశాఖల మధ్య ఎవరికి ఎవరో తెలియని పరిస్థితులను కొంతమంది వీఎస్ఏలో బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఫలానా పనులు చేయాలని పైధికారులు ఏదైనా చెబితే నాకు వేరేపని అప్పగించారు. అక్కడ ఉన్నానంటూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు తోటి వీఎస్ఏల నుంచే వినబడుతున్నాయి. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎస్ఓలు, ఏఎస్ఓలను సైతం బురిడీ కొట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రెటరీ ఇలా ఎవరు పని పురమాయించినా ఏదో ఒకశాఖ అధికారి పేరుచెబుతూ తప్పించుకుంటున్నారని అధికార వర్గాలు మండిపడుతున్నాయి.



జిల్లాకేంద్రంలోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయ ముఖద్వారం

మాతృశాఖలో విలీనం చేయాలి



ఉమ్మడి జిల్లాలోని 150మంది వీఎస్ఏలు సెరికల్చర్‌లో ప్రత్యేకమైన కోర్సులు చేసిన విద్యావంతులు. మాతృశాఖలో విలీనంచేస్తే.. మల్బరీ రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించడానికి అవకాశం ఉంటుంది. పట్టుపరిశ్రమ, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ మూడు శాఖలకు వీఎస్ఏల ఉద్యోగాన్ని ముడిపెట్టారు. వీఎస్ఏలను మాతృశాఖలో కలపాలని గత ప్రభుత్వంలో అనేకసార్లు వేడుకున్నాం. పట్టించుకోవపోవడంతో పోరాటాలు చేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మడకశిరకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారు. మరోసారి మంత్రి నారా లోకేశ్, సెరికల్చర్ కమిషనర్‌ను కలిసి వివరిస్తాం.

-డాక్టర్ అంజనరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

ఎస్ఆర్‌లు మా శాఖలోనే..



వీఎస్ఏల సర్వీస్ రిజిస్టర్(ఎస్ఆర్)లు మాశాఖలోనే ఉన్నాయి. సాధారణ సెలవులు మినహా మెడికల్, మెటర్నటీ, మ్యారేజ్ వంటివాటికి ఎక్కువ రోజులు సెలవులు కావాలంటేనే అనుమతిచ్చే అధికారాలున్నాయి. వీఎస్ఏలను అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షిస్తుంటే, పంచాయతీరాజ్‌శాఖనుంచి జీతాలు ఇస్తున్నారు. వీలీన అంశాన్ని రాష్ట్ర అధికారులు పరిశీలిస్తున్నారు. మా శాఖలో ప్రస్తుతమున్న అధికారులు, సిబ్బందితో మల్బరీసాగులో ప్రగతిని సాధిస్తున్నాము. వీఎస్ఏలు తోడైతే అవసరమైన ప్రాంతాల్లో విధులు కేటాయించవచ్చు.

-అంజనేయులు, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి

సాయుధ దళాల నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


సైనిక్‌నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ ప్రాణత్యాగాలు చేస్తున్న సైనికుల కుటుంబాల సంరక్షణ కోసం సాయుధ దళాల నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరులైన వీరజవాన్ల కుటుంబాలను ఆదుకోవడానికి ఉదారంగా అన్నివర్గాల ప్రజలు విరాళాలు అందజేయాలని కోరారు. విరాళాలు సైనిక సంక్షేమం కోసం ఖర్చుపెడతారన్నారు. సహకారం అందించి, సైనికుల రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులందరూ తమవంతు సాయం చేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వే సహాయ మంత్రికి ఎంపీ అంబికా వినతి

అనంతపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని రైల్వేశాఖ సహాయ మంత్రి (రైల్వే మినిస్టర్ ఆఫ్ స్టేట్) సోమన్నను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. పార్లమెంటులోని మంత్రి చాంబర్‌లో ఆయన్ను ఎంపీ సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతపురం, రాయదుర్గం, గుత్తి, హిందూపురం పట్టణాలకు సంబంధించి రైల్వే సమస్యలున్నట్లు వివరించారు. రాజధాని ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-బీదర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ -లాతూర్ ఎక్స్‌ప్రెస్‌ల ను అనంతపురం మీదుగా నడపాలన్నారు. టాటానగర్ - యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్- వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-జైపూర్, తిరుపతి-దోడహల్లి ఎక్స్‌ప్రెస్‌లు రాయదుర్గం మీదుగా నడపాల న్నారు. సంపర్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, కంగు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రాయల్ చెరువులో నిలిపేలా చూడాలన్నారు. వందే భారత్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లను హిందూపురంలో నిలపాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారని విన్నవించారు. గుంతకల్లు అనంతపురం నగరాలలో వివిధ చోట్ల అండర్‌పాసులు నిర్మించాలని కోరారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి యశ్వంత్‌పూర్ వరకు, మచిలీపట్నం ఎక్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి హిందూపురం వరకూ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి అనంతపురం వరకు, హౌరా ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి నుంచి గుంతకల్లు వరకూ కొనసాగించాలన్నారు. మైసూర్ టు జైపూర్ ఎక్స్‌ప్రెస్ వారానికి రెండు మూడు రోజులు నడపాలని, యశ్వంత్‌పూర్ టు జైపూర్ వారానికి మూడు రోజులు నడపాలని ఆయన మంత్రిని కోరారు. హిందూపురం-బెంగళూరు మెము ట్రైన్‌లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. తిరుపతి-కదిరి దేవరపల్లి రైలుని తిరిగి ప్రారంభించాలన్నారు. గుంతకల్లు-చిక్ జార్జూర్ రైలు రోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపురం, హిందూపురం రైల్వేస్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన రైల్వేస్టేషన్లలో కోచ్ డిస్‌ప్లే బోర్డులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు, మరుగుదొడ్లు, తాగునీరు, సిట్టింగ్ ఫెసిలిటీస్, క్యాంటిన్, లైట్లు, ప్లాట్‌ఫామ్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే రైల్వేస్టేషన్లలో నిర్మాణాలు సరిగ్గాలేవో ఆ ప్రాంతాల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.


కేంద్ర మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నేడు పింఛన్ల పరిశీలన

- డీఆర్‌డీఏ-వెలుగు పీడీ, డీఎల్‌డీఓ పర్యవేక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో భారీగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో జిల్లాలో ఒక గ్రామ-వార్డు సచివాలయాన్ని ఎంపిక చేశారు. ఇందుకు తనిఖీలకు పక్క మండలానికి చెందిన అధికారులను నియమించారు. ఒక్కో తనిఖీ బృందం 40పింఛన్లు మాత్రమే పరిశీలిస్తుంది. ఆయా సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారుల సంఖ్యను బట్టి ఎన్ని బృందాలు అవసరమో నిర్ణయిస్తారు. ఈ బృందం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తుంది. జిల్లాలో ఈ ప్రక్రియ మంగళవారం చేపట్టాలని సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

చియ్యేడు గ్రామంలో...

అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో పింఛన్లను పరిశీలిస్తారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, డీఎల్‌డీఓ లలితాబాయిల నేతృత్వంలోని 11బృందాలు పింఛన్ల తనిఖీ చేయనున్నారు. గ్రామంలో మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. ఇందులో వృద్ధులు 250మంది, వితంతువులు63, దివ్యాంగులు 54, అభయహస్తం 32, సఫాయి కర్మచారులు 8మంది, చేనేతలు 7, ఒంటరి మహిళలు 6, డప్పు కళాకారులు 3, తలసేమియా 2 మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల నుంచి అధికారులు పరిశీలనలో పాల్గొననున్నారు. ప్రతి బృందంలో ఒక మండల అధికారి, ఒక గ్రామ సచివాలయ ఉద్యోగి ఉంటారు.

సీఎం హామీలన్నీ నెరవేర్చాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు నేమకల్లులో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. సోమవారం సీఎంఇచ్చిన హామీలు, ఇప్పటివరకు అక్కడ కొనసాగుతున్న పనులతీరుపై కలెక్టర్.. అధికారులతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేమకల్లు సభలో సీఎం 27రకాల హామీలు ఇచ్చారన్నారు. ఆయా హామీల అమలుకు సంబంధితశాఖల అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలన్నారు. బొమ్మనహాళ్ మండలంలో బీసీ రెసిడెన్షియల్‌పాఠశాలఏర్పాటుకు స్థలసేకరణ చేపట్టి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. 12మందికి ఇళ్లు మంజూరు చేయాలని, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన అభివృద్ధి పనులకు 24గంటలలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ, హౌసింగ్ పీడీ, పీఆర్ఎస్ఈ, విద్యుత్ఎస్ఈ, డ్వామాపీడీ పాల్గొన్నారు.

15న అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు ఈనెల 15న అనంత క్రీడా గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి తెలిపారు. 2012 సెప్టెంబరు 1వతేదీ నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రికెట్ కిట్, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7702889365 నంబరులో సంప్రదించాలని కోరారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

- 474 బాక్సుల గోవా మ్యాన్సన్ హౌస్ స్వాధీనం
- మొత్తం విలువ రూ.44 లక్షలు
- నలుగురు నిందితుల అరెస్టు
- ప్రధాన నిందితుడు 'బూసుపల్లి' పరారీ

అనంతపురం అర్బన్/ రాప్తాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ స్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవా మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి, విక్రయిస్తున్న అనంతపురానికి చెందిన నలుగురు నిందితులు అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మెన్ ఆనంద్‌లను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. రాప్తాడు మండలం రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన ఏపీ ధరల మేరకు రూ.44 లక్షల విలువైన 474 బాక్సుల గోవా మద్యాన్ని (మ్యాన్సన్ హౌస్ క్వార్టర్ బాటిళ్లు) అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు వెంకటశివకుమార్‌రెడ్డి గతంలో పొలంలోని రేకుల షెడ్‌ను లీజుకు తీసుకొని గొర్రెల యూనిట్‌ను పెట్టినట్లు తెలిసింది. ఆ తర్వాత గొర్రెల యూనిట్‌ను పక్కన పెట్టి, అదే రేకుల షెడ్‌లో గోవా నుంచి తెచ్చిన అక్రమ మద్యాన్ని నిల్వ చేసి, మరో నలుగురి సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం.

సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించిన పోలీసులు

బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి, మరికొందరు గోవా నుంచి అక్రమంగా మద్యం బాటిళ్ల జిల్లాకు తీసుకొచ్చి, విక్రస్తున్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామికి రెండు రోజుల క్రితం సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బృందాలుగా విడిపోయి ప్రధాన నిందితుడు, ఇతర నిందితుల కోసం గాలించారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ప్రధాన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో కారులో తిరిగినట్లు సమాచారం. ఇదే క్రమంలో తాను అక్రమంగా నిల్వ ఉంచిన రేకుల షెడ్ వద్దకు అతను వెళ్లినట్లు సమాచారం. సెల్ సిగ్నల్ ఆధారంగా సోమవారం సాయంత్రం రేకుల షెడ్ వద్దకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులకు అక్కడ మద్యం ఖాళీ అట్టపెట్టెలు ఉండటంతో రేకుల షెడ్‌లోకి వెళ్లి చూశారు. అక్కడ భారీగా గోవా మద్యం బాటిళ్లు ఉండటాన్ని గమనించారు. అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని సీజ్ చేశారు.


రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన గోవా మద్యం


మీడియాతో మాట్లాడుతున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రధాన నిందితుడు పరారీ



గోవా అక్రమ మద్యం నిల్వ, విక్రయంలో ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడితో కలిసి అక్రమ మద్యం నిల్వ, విక్రయించిన నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురానికి చెందిన అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మన్ ఆనంద్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడికోసం గాలింపును ముమ్మరం చేశారు. గోవా అక్రమ మద్యాన్ని చాకచక్యంగా పట్టుకున్న అధికారులు, సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అభినందించారు. ఈ దాడుల్లో అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్ఐ జాకీర్ హుస్సేన్, అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు లక్ష్మీసుహాసిని, సునంద, అన్నపూర్ణ, అలిబేగ్, ఎస్ఐలు సత్యనారాయణ, హరికృష్ణ, హెచ్‌సీలు, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లాకేంద్రంలో సాయినగర్‌లోని యాపిల్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తిలు హాజరై ప్రసంగిస్తారన్నారు.



మహాసభల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కలకలం

- సెంట్రల్ వర్సిటీ హాస్టల్ వద్ద తచ్చాడిన దుండగులు
- విద్యార్థినుల కేకలతో పరారైన వైనం
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు
- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ వసతిగృహంలో అమ్మాయిల భద్రతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం 40 మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది పహారా ఉన్న లేడీస్ హాస్టల్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు తచ్చాడినట్లు సమాచారం. అప్రమత్తమైన ఓ విద్యార్థిని గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పరారైనట్లు సమాచారం. తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటన ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం. విద్యార్థినులు వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించా రు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లేలోపు ఆ దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది.

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో 900పైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. ఇందులో 400 మందికిపైగా లేడీస్ హాస్టల్లో ఉంటున్నారు. వర్సిటీలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం బిహార్ నుంచి కూలీలు వచ్చారు. వారు క్యాంపస్‌లోనే తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. అయితే ఆదివారం రాత్రి పొద్దుపోయాక హాస్టల్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు తచ్చాడటంతో ఓ విద్యార్థి గమనించి గట్టిగా కేకలు వేసినట్లు తెలిసింది. విద్యార్థుల సమాచారంతో పోలీసులు క్యాంపస్‌లోకి వచ్చేసరికి దుండగలు పరారీ అయినట్లు సమాచారం. దీనిపై పోలీసు బ్లూ క్లోట్స్ పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు కరుణాకర్, కౌలుట్లయ్య, ఇటుకలపల్లి సీఐ హేమంత్ పోలీసు సిబ్బంది సంఘటనకు స్థలానికి చేరుకున్నారు. నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. అనంతరం సోమవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి డాగ్ స్క్వాడ్‌ను ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆరోపణలు వ్యాపించడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ వర్సిటీని సందర్శించారు.


సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన లేడీస్ హాస్టల్

ఆరోపణలే..


అనంతపురం సెంట్రల్: వర్సిటీ బాలికల వసతి గృహం ప్రాంగణంలో పురుషులు తచ్చాడారనే ఆరోపణల్లో వాస్తవంలేదు. భవనం ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆరోపణలపై సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఎక్కడా అలాంటి దృశ్యాలు కనిపించలేదు. పోలీసు బృందం కూడా ఫుటేజ్‌లను పరిశీలించింది. ఇలాంటి దుశ్చర్యలకు చోటులేకుండా వర్సిటీలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు అమర్చాము. 24 గంటలు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వర్సిటీలోకి వచ్చేపోయే ప్రతిఒక్కరి వివరాలు నమోదు అవుతున్నాయి.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరీ, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సీ రాజగోపాలాచారి (జయంతి)



'భారతరత్న' పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి, రాజాజీగా పేరొందిన చక్రవర్తి రాజగోపాలాచారి 1878 డిసెంబరు 10న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా తోరపల్లి గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త, స్వతంత్ర భారత తొలి, చివరి గవర్నర్ జనరల్. సంయుక్త మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1937లో పనిచేశారు. కాగా 1900లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి సామాజిక, రాజకీయ స్థితిగతులపై ఆసక్తి చూపారు. మహాత్మాగాంధీ పిలుపుతో న్యాయవాద వృత్తిని వీడి స్వాతంత్ర్య ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరించారు. కాగా తమిళంలో సాహిత్య సేవలకు సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆధునిక భారతదేశం కోసం కృషి చేసిన ఆయన 94వ యేట 1972 డిసెంబరు 25న కన్నుమూశారు.

కట్టమంచి రామలింగారెడ్డి (జయంతి)



ప్రముఖ విద్యావేత్త సీఆర్ రెడ్డిగా ప్రసిద్ధిచెందిన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి 1880 డిసెంబరు 10న చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించారు. సాహితీవేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది, ఆదర్శ వాదిగా, రాజనీతిజ్ఞుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్రభాషా రంజని సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. బరోడా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, మైసూరులో విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. ఆజన్మాంతం బ్రహ్మచారిగా జీవించారు. అర్థశాస్త్రంపై ఆయన రాసిన పుస్తకాలు ఆంధ్రవిజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రచురించింది. 1951 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ (వర్ధంతి)



ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ 1833 అక్టోబరు 21న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన కెమిస్ట్, ఇంజనీర్, ఆవిష్కర్త, వ్యాపారవేత్త, మానవతావాది. ఆయన 335 పేటెంట్‌లు కలిగి ఉండగా ప్రత్యేకించి డైనమైట్ ఎంతో ప్రత్యేక కలిగి ఉంది. రాయల్ స్వీడిష్ కాడమీ సైన్సెస్ సభ్యుడిగా ఎంపికయ్యారు. తను సంపాదించినది నోబెల్ ప్రైజ్‌కోసం కేటాయించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల సాధకులకు అత్యున్నతమైన నోబెల్ ప్రైజ్ ఇస్తున్నారు. 1896 డిసెంబరు 10న కన్నుమూశారు.

అశోక్‌కుమార్ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత అశోక్ కుమార్ 1911 అక్టోబరు 13న బీహార్ రాష్ట్రం భగల్‌పూర్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కుముద్‌లాల్ గంగూలీ. హిందీ సినీ రంగంలో తొలి సూపర్‌స్టార్‌గా నిలిచిన ఆయన హీరోగాను, విలన్‌గాను సత్తా చాటుకున్నారు. దాదామొనిగా పిలవబడ్డారు. 275కు పైగా సినిమాలు, 30కుపైగా బెంగాలీ నాటకాల్లో నటించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2001 డిసెంబరు 10న కన్నుమూశారు.

పాలడెయిరీల విభజన సక్రమమే

» బూదికోటె డెయిరీ మాజీ అధ్యక్షుడు మార్కండేగౌడ

బంగారపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోలారు పాల సమాఖ్యలో ప్రాంతాల విభజన సహకారసంఘాల చట్టం ప్రకారం జరిగిందని అయితే హుత్తూరు హోబళిని బంగారపేటలోకి చేర్చేందుకు కుట్ర పన్నుతున్నారని, పునర్విభజన జరిగితే న్యాయపోరాటం చేస్తామని బూదికోటె డెయిరీ మాజీ అధ్యక్షుడు మార్కండేగౌడ తెలిపారు. పట్టణంలోని కెంపేగౌడ భవనంలో ఏర్పాటైన సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ కోలారు జిల్లాలోని 11 డెయిరీలను ఆయా డివిజన్‌లకు అనుగుణంగా విభజించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు చేశామన్నారు. బంగారపేట తాలూకాలో విభజన సక్రమంగానే జరిగిందన్నారు. గతంలో కేజీఎఫ్, బంగారపేట తాలూకాలు ఒకే డివిజన్‌గా పరిగణించేవారన్నారు. మొత్తం 124 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను రెండు తాలూకాలకు వేర్వేరు డివిజన్‌లుగా చేసి బంగారపేట తాలూకాకు 62 సంఘాలు, కేజీఎఫ్‌కు 62 సంఘాలను సమానంగా పంచామన్నారు. ఈ పంపిణీ ద్వారా తాలూకాలో ఎవరికైనా సమాఖ్యకు వెళ్ళే అవకాశం లభించిందని అయితే కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా తమ ప్రాబల్యం కోసం వడగూరు హరీశ్‌ను అభ్యర్థి చేసేందుకు కోలారు తాలూకాలోని హుత్తూరు హోబళిని బంగారపేట తాలూకాకు చేర్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. హుత్తూరు హోబళి కోలారు తాలూకాకు చెందినదని, కేవలం శాసన సభ నియోజకవర్గం పరిధిలో మాత్రమే బంగారపేటకు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ పునర్విభజన జరిగితే వడగూరు ప్రదేశం కోలారు నియోజకవర్గానికి వెళ్లే అవకాశం ఉందన్నారు. ఒకరి మెప్పుకోసం, రాజకీయ ప్రాబల్యం చాటుకునేందుకు పునర్విభజనలో అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. మీడియా సమావేశంలో హనుకుంద డెయిరీ అధ్యక్షుడు వెంకటేశ్, సంపంగిరెడ్డి, రామప్ప, రమేశ్, సీతారామప్ప, జుంజనహళ్ళి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో బూదికోటె డెయిరీ మాజీ అధ్యక్షుడు మార్కండేగౌడ తదితరులు

మేకెదాటు ప్రాజెక్టుకు వెనుకడుగు

» అధికారుల అసంతృప్తి

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా కనకపుర ప్రాంతంలో నిర్మించ దలిచిన మేకెదాటు ప్రాజెక్టు అధ్యయన నివేదికకు అవసరమైన నిబంధనలను కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ సకాలంలో రూపకల్పన చేయక పోవడంతో రాష్ట్రానికి వెనుకడుగు ఏర్పడిందని అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అటవీభూమి స్వాధీనానికి అనుమతులు కోరుతూ కేంద్ర అటవీమంత్రిత్వశాఖ ప్రస్తావనలు పంపారు. అయితే ఇప్పటివరకు అనుమతులు లభించలేదు. దీనికితోడు కేంద్ర జలమండలి తన కార్యాచరణ జాబితాలో మేకెదాటు ప్రాజెక్టు చర్చను ప్రస్తావించలేదు. ఇలా ప్రాజెక్టు ప్రగతికి నోచుకోని విధంగా మారింది. మేకెదాటు ప్రాజెక్టు ముంపుగా ఉండే అటవీభూములకు ప్రత్యామ్నాయంగా రామనగర, మండ్య, చామరాజనగర జిల్లాల పరిధిలో గుర్తించారు. త్వరలోనే భూస్వాధీన ప్రక్రియకు సంబంధిత జిల్లా అధికారులతో సభ జరిపేందుకు జలవనరులశాఖ నిర్ణయించింది. మేకెదాటు ప్రాజెక్టు కోసం కావేరి అభయారణ్యం సంరక్షిత అటవీప్రాంతంలో 5,096.22 హెక్టార్ల అటవీభూమి అవసరం కానుంది. ఈ భూమికి బదులుగా 7,404.62 హెక్టార్ల సి అండ్ డి కేటగిరీలోని భూమితోపాటు డీమ్డ్ ఫారెస్టు భూమిని గుర్తించారు. అందులో 53 శాతం రామనగర జిల్లా పరిధిలో ఉంది. ప్రత్యామ్నాయ భూమిని స్వాధీనం చేసుకుని అటవీశాఖకు అప్పగించే ప్రక్రియ త్వరలోనే ప్రారంభించదలిచారు. ప్రాజెక్టు ఎప్పుడు అమలు కానుందో వేచి చూడాలి.

రద్దు చేసిన బీపీఎల్ కార్డులు పునరుద్ధరించాలి

బాగేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన బీపీఎల్ కార్డులను పునరుద్ధరించి అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతూ ప్రాంత వ్యవసాయ కూలీల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఏఐఏడబ్ల్యు జిల్లా సమితి నేతృత్వంలో బాగేపల్లి తాలూకా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణంలోని సీపీఎం సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా కార్యకర్తలు డాక్టర్ హెచ్‌ఎన్ సర్కిల్ వరకు సాగారు. తహసీల్దారు మనీషాకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బిళ్ళూరు నాగరాజు మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర జిల్లాలో ఇప్పటికే 2175 రేషన్‌కార్డులను రద్దు చేశారని తాలూకాలోనూ వందలాదిమంది ఉన్నారన్నారు. దీంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా రేషన్‌కార్డులలో పేర్ల మార్పు, సవరణ, కొత్తకార్డులకోసం ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. నిరసనలో సంఘం జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప, రఘురామరెడ్డి, సావిత్రమ్మ, మంజునాథ్, ఎల్ వెంకటేశ్, జహీర్‌బేగ్, గొల్లపల్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కార్యాలయం వద్ద నిరసన

అలరించిన కూచిపూడి నృత్యాలు



నృత్య ప్రదర్శనలో ఓ సన్నివేశం

బెంగళూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాట్యసరస్వతి సంస్థ సంగీత నృత్యోత్సవాలలో భాగంగా కూచిపూడి నృత్యాలు సభికులను అలరించాయి. రిథమ్స్‌స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థాపకురాలు డాక్టర్ సరస్వతి రజతీశ్ ఆధ్వర్యంలో ఆదివారం సంగీత నృత్యోత్సవాలు జరిగాయి. హిందూస్తానీ సంగీత కచేరీని తిలకించేందుకు పెద్ద ఎత్తున అభిమానులు హాజరయ్యారు. ఆనందరాజ్ గోన్వార్ హిందూస్తానీ గాయనం చేశారు. వినాయకస్తుతి, స్వరజితి తరంగం, భామా కలాపం వంటి అంశాలపై కళాకారులు ప్రదర్శించారు. గానసరస్వతి నాట్యనిపుణి పురస్కారాలను డాక్టర్ మానసి రఘునందన్, నందకుమార్, ఆనందరాజ్, డాక్టర్ అనుపమలకు ప్రదానం చేశారు. నాట్య సరస్వతి సంస్థకు కేంద్ర సాంస్కృతిక సంస్థ, కన్నడ సంస్కృతిశాఖ గుర్తింపు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇక్కడి విద్యార్థులు పాల్గొంటున్నట్టు సరస్వతి రజతీశ్ తెలిపారు.

నులిపురుగుల నియంత్రణపై అవగాహన



పాల్గొన్న విద్యార్థులు

శిడ్లఘట్ట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా తాలూకాలోని మేలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం ప్రత్యేక జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి ప్రారంభించారు. మనం తినే ఆహారం ద్వారా ఒక్కోసారి కడుపులో తలెత్తే నులిపురుగుల నివారణకోసం పిల్లలు కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నులిపురుగుల వల్ల ఎనీమియా, అజీర్ణం, బరువు తగ్గడం, కడుపునొప్పి, వాంతులు విరేచనాలు వంటి సమస్యలు వస్తాయన్నారు. ఆహారం తీసుకునేముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రభుత్వం అందచేసే అల్బెండజోల్ మాత్ర తీసుకోవడం ద్వారా సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని అలాగే చక్కటి ఆరోగ్య విధానాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, మేలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేశ్, సీనియర్ తాలూకా ఆరోగ్య అధికారి దేవరాజ్, టెక్నికల్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు తదితరులు

ఘనంగా కనకదాస జయంతి

దొమ్మసంద్ర, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా హారగద్దె గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్ గొల్లహళ్ళిలో దాసశ్రేష్ఠుడు కనకదాస 537వ జయంతిని ఘనంగా ఆచరించారు. గ్రామానికి చెందిన కనకసేవా యువజన సంఘం, గ్రామపెద్దల సహకారంతో కార్యక్రమం కొనసాగింది. పురవీధులలో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. మహనీయుల జయంతుల కార్యక్రమాలను అర్థవంతంగా చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.



కనకదాస చిత్రపటానికి పుష్పాంజలి

కబ్జా చేసి.. వైసీపీ నాయకుడి దౌర్జన్యం

సర్వేకి వెళ్లిన రెవెన్యూ అధికారులు, పోలీసులతో వాగ్వాదం

పెనుకొండ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో శోత్రియం భూమిని ఫేక్ రిజిస్ట్రేషన్ ద్వారా కబ్జా చేసిన వైసీపీ నాయకుడు.. తాజాగా సర్వే చేసేందుకెళ్లిన అధికారులపై దౌర్జన్యానికి దిగాడు. తన అనుచరులను ఉసిగొల్పాడు. పెనుకొండ మండలం బొజ్జిరెడ్డిపల్లిలో సర్వే నంబరు 28/2లో 28సెంట్ల శోత్రియం భూమి ఉంది. భూమికి సంబంధించిన వారు లేకపోవడంతో శెట్టిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కన్నేశాడు. తన భార్య అర్చన పేరిట బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021లో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్నుంచి భూమిని తన ఆధీనంలో ఉంచుకున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. స్థలం కోసం రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్వే మొదలెట్టారు. సోమవారం గ్రామంలోని శోత్రియం భూములను పరిశీలించారు. ఈ క్రమంలో కృష్ణారెడ్డి.. తన అనుచరులతో కలిసి అధికారులపై దౌర్జన్యానికి దిగాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు.. ఒంటిపై పెట్రోల్ పోసుకున్న మంజుల

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ టౌన్: బొజ్జిరెడ్డిపల్లిలోని శోత్రియం భూమిని సర్వే చేసేందుకు ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో తేజారెడ్డి, సర్వేయర్ భరత్‌కుమార్, పోలీసులు వెళ్లారు. ఆ సమయంలో కృష్ణారెడ్డి బంధువు మంజుల ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో కళ్లలోకి పెట్రోల్ పడింది. కళ్లు మంట కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ వెంకటేశ్వర్లును అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వీఐపీల భద్రత విషయంలో వ్యక్తిగత భద్రతాధికారు(పీఎస్‌ఓ)లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రత్న ఆదేశించారు. స్థానిక జిల్లాపోలీసు కార్యాలయంలో జిల్లాలో వీఐపీల భద్రతా విధులు నిర్వర్తిస్తున్న పీఎస్‌ఓలకు మూడురోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. వీఐపీలకు భద్రత కల్పించడం సవాళ్లతో కూడుకున్నదన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలసత్వాన్ని దరి చేరనీయరాదని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తీర్ణతపెంచడమే లక్ష్యం

కొత్తచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి సంకల్ప 2025 కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. తద్వారా ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో సంకల్ప తరగతులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 22 ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3872 మందికి, సెకండియర్‌లో 3063 మందికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

సావర్కర్ ఫొటో తొలగించేది లేదు

» శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణ సౌధలో అసెంబ్లీ ప్రాంగణంలో బీజేపీ పాలనలో అమర్చిన స్వాతంత్ర్య పోరాటనేత వినాయక దామోదర్ సావర్కర్ ఫొటో తొలగించేది లేదని స్పీకర్ యూటీ ఖాదర్ స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభంలో సోమవారం అధికార కాంగ్రెస్ సభ్యులు ప్రస్తావన తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన స్పీకర్ రచనాత్మకమైన మార్గాన్ని అనుసరిస్తామేగానీ వినాశమైన మార్గం గురించి ఆలోచించేది లేదన్నారు. సకారాత్మకమైన అంశాలకు మాత్రమే అవకాశం ఉంటుందంటూ ప్రస్తావించి సావర్కర్ ఫోటోను తొలగించలేమన్నారు. సావర్కర్ ఫోటోను తొలగించాలనే అంశంపై చర్చ జరిగింది. అధికార కాంగ్రెస్‌లో అంతర్గతంగాను ఈ అంశంపై తీవ్రమైన ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది. అయితే స్పీకర్ తొలిరోజే తేల్చి చెప్పడంతో సావర్కర్ ఫోటో వివాదానికి తెరదించినట్టయ్యింది.

చురుగ్గా ఆలయ జీర్ణోద్ధరణ పనులు



నిర్మాణదశలో ఉన్న ఆలయం

చేళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలోని చాకవేలు మార్గంలో పులగల్లు గ్రామపంచాయతీ కేంద్రంలో పురాతనమైన శివాలయ జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దుస్థితికి చేరుకున్న ఆలయాన్ని స్థానిక భక్తులు, దాతల సాయంతో పునరుద్ధరిస్తున్నారు. ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మిస్తున్నారు. సుమారు ఏడాదికాలంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆలయ నమూనా ఒక కొలిక్కి వచ్చింది. ఇప్పటికే రూ.10లక్షలకుపైగా ఖర్చు అయినట్టు తెలుస్తోంది. మరో ఆరు నెలలపాటు పనులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆలయం పూర్తిగా నిర్మాణమైతే అక్కడికి వెళ్లే మార్గాన్ని కూడా తీర్చిదిద్దే అవకాశం ఉందని గ్రామస్థుల ద్వారా తెలుస్తోంది.

ప్రశాంతంగా పంచాయతీ ఉప ఎన్నికలు



క్యూలో వేచి ఉన్న ప్రజలు

శిడ్లఘట్ట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని నాలుగు గ్రామపంచాయతీలకు ఆదివారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మలమాచనహళ్ళి, నాగమంగల, హొసపేట, భక్తరహళ్ళిలలోని 45 స్థానాలకు జరిగిన పోలింగ్ 93.84 శాతం నమోదైంది. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం వరకు ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ బీఎన్ స్వామి తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ మద్దతుదారులు తమ అనుచరులతో కలసి ఓటింగ్‌లో పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల తరహాలో అక్రమాలకు తావులేకుండా గట్టిబందోబస్తు నిర్వహించారు. కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ, డాక్టర్ శశిధర్ మునియప్ప, పుట్టు ఆంజినప్ప, కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాస రామయ్య మద్దతుదారులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అర్జీల వెల్లువ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 232 అర్జీలు సమర్పించారు. వాటిని కలెక్టర్ టీఎస్ చేతన్ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల విషయంలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫిర్యాదులపై పర్యవేక్షించేందుకు మండలస్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆ విషయాన్ని అర్జీదారులకు మొబైల్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కలెక్టర్ వివరించారు.

అడవికి నిప్పు.. మనిషికి ముప్పు..

అడవులకు నిప్పుపెట్టడం అంటే మనిషికి ముప్పు తెచ్చుకోవడమేనని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. అడవికి నిప్పు పెట్టకూడదని తెలియచేస్తూ జిల్లా అటవీశాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అడవికి అనుకుని ఉన్న 302 గ్రామాల్లో గొర్రెలు, పశువుల కాపర్లు, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. అడవుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 70 అర్జీలు వచ్చాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదుల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

50వేల పోస్టుల భర్తీకి చర్యలు

- కళ్యాణ కర్ణాటకలో నిరుద్యోగాన్ని రూపుమాపుతాం
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్



రాయచూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ కర్ణాటక ప్రాంతంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తగిన కార్యచరణ చేపట్టినట్లు రాష్ట్ర వైద్యవిద్య శాఖ, రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలోని సింధనూరు తాలూకాలో దెబ్బతిన్న వరి పొలాలను సోమవారం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం రూ.20 కోట్లతో చేపట్టిన గ్రామీణ ప్రాంతాల రోడ్ల పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం సింధనూరు నగరంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన మంత్రి, ఇచ్చిన హామి మేరకు ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం సంకల్పించగా ఇప్పటి వరకు 15వేల పోస్టులు భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో వెయ్యికి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయని త్వరలోనే పూర్తి స్థాయి నియామకాలు చేపడుతామన్నారు. సింధనూరు తాలూకాలో 9400 ఎకరాలకు పైగా వరి పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారని రైతులకు తగిన పరిహారం అందజేసేందుకు ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా సింధనూరు తాలూకాలో ముగ్గురు బాలింతలు ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించిన విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక్క రాయచూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా నివేదిక ఇవ్వాల్సిందిగా అన్ని జిల్లాల జిల్లాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక అందిన అనంతరం బాధ్యుల పై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.45	1,591.68
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,055	725
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,175	2,535
నీటి నిల్వ (టీఎంసీలు)	92.02	12.49

17న బియ్యం, గోధుమల

బహిరంగ వేలం

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆహార పౌరసరఫరా శాఖ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి జప్తు చేసిన బియ్యం, గోధుమలను వేలం వేయనున్నారు. 4128.44 క్వింటాళ్ళ బియ్యం, 63.20 క్వింటాళ్ళ గోధుమలను ఈ నెల 17వ తేదీన ఉదయం 11గంటలకు నగరంలోని ఏపీఎంసి మార్కెట్ ప్రాంగణంలో ని కర్ణాటక ఆహార సరఫరా శాఖ గోడౌన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా ఆహార పౌరసరఫరా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే బిడ్డర్లు రూ 2,00,000/- లక్షల సెక్యూరిటీ డిపాజిట్‌ను అసిస్టెంట్ డైరెక్టర్ ఆహార పౌరసరఫరా శాఖ పేరు మీదుగా డీడీ రూపంలో తీసి డిసెంబరు 16వ తేదీ ఉదయం 5.30గంటలకు అందజేయాలన్నారు. ఈ వేలం ప్రకియలో ప్రభుత్వం కొనుగోలు చేసే ఓఎంఎస్ఎస్(డీ) ధర క్వింటాల్ బియ్యం రూ 2,300/-లు ధర నిర్ణయించినట్లు తెలిపారు. బిడ్డింగ్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధర తక్కువ కావడం లేదా, బిడ్డర్ల సంఖ్య తక్కువగా ఉన్న సమయంలో వేలం ప్రక్రియ కొనసాగింపు లేదా వాయిదా వేయడం సంబంధిత అధికారులదే తుది నిర్ణయం అన్నారు. వేలం ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లు వేలం పాట రోజున అరగంట ముందే ఉండాలని ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో సగటు, రిటైల్, కమిషన్ ఏజెంట్లు, రైస్ మిల్లర్లు పాల్గొనేందుకు అర్హులు. బిడ్‌లో నమోదు చేసిన ధరలు జిల్లాధికారి ఆమోదించిన తరువాతనే బిడ్ మొత్తం విలువను ప్రభుత్వం ఖజానాకు నిర్ణీత సమయంలో జమా చేయాల్సి చలానాను అందజేసిన తరువాతనే బియ్యం తీసుకెళ్ళడానికి అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో బిడ్ దక్కించుకున్న వారు సొంత ఖర్చుతో బియ్యాన్ని ఆదేశాలు అందిన మూడు రోజుల్లో తీసుకెళ్ళడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆహార పౌరసరఫరా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

● ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

బళ్లారిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం తాలుకాలోని సంగనకల్ సమీపంలో సంగనకల్ గ్రామానికి చెందిన గాలప్ప (37), గోపాల్ ఇద్దరూ స్నేహితులు. పొలానికి వెళ్లి తిరగి వస్తూ సంగనకల్ వద్ద రోడ్డు దాటుతుండగా బళ్లారి నుంచి మోకా వైపు వెళ్తున్న కారు బలంగా ఢీ కొంది. దీంతో కింద పడ్డ గాలెప్ప అక్కడికక్కడే మృతి చెందగా తోటి స్నేహితుడు బైక్ నడుపుతున్న గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఆంబులెన్స్‌లో బళ్లారి విమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గాలెప్పకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా న్యాయాధికారి రాజేష్ హొసమనె



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేష్ హొసమనె

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, యుక్తవయస్కులు నులిపురుగుల నివారణ మాత్ర వేసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. జిల్లాపాలనాధికారి, జిల్లా పంచాయ తీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్రీయ నులిపురుగుల నివారణ దినోత్సవ జిల్లాస్థాయి డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లల ఎదుగుదలకు ఆటంకం కలిగించే రక్తహీనత నివారణకు 1నుంచి 19ఏళ్ల లోపు పిల్లలకు , కౌమారదశలో ఉన్న పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) తప్పనిసరిగా వేయాలన్నారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు ఉచితంగా అందజేస్తారన్నారు. పిల్లలు, యుక్తవయస్కులు పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కలుబురగి డివిజనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ కో-డైరెక్టర్ డా.అంబరాయ్, ఎస్, రుద్రవాడీ మాట్లాడుతూ క్రిములను నిర్మూలించడం ద్వారా పిల్లల్లో రక్తహీనత నియంత్రణలోకి వచ్చి పౌష్టికాహారం మెరుగవుతుందన్నారు. ఆల్బెండజోల్‌తో రోగనిరోధక శక్తి , ఏకాగ్రత, పఠనంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. రోగముక్త రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలన్నారు. కార్యక్రమానికి జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు అధ్యక్ష వహించి మాట్లాడు తూ సమాజంలోని పిల్లలందరినీ నులిపురుగుల బారి నుంచి రక్షించేందుకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కొన్ని సార్లు పిల్లల్లో నులిపురుగుల సమస్యల సమస్యల లక్షణాలు ఉండకపోవచ్చు, కాబట్టియ పిల్లలకు, పెద్దలకు భవిష్యత్తులో ఆరోగ్య విద్య, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి నులిపురుగుల నిర్మూలన మాత్ర సురక్షితమైనది. నులిపురుగుల నిర్మూలన మాత్ర పిల్లల శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు దోహదపడుతుందన్నారు. ఈసందర్భంగా జిల్లాలెప్రసీ కంట్రోల్ అధికారి డా.వీరేంద్రకుమార్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్, సహ ఉపాధ్యాయులు, హరిప్రసాద్‌తో పాటు ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశావర్కర్లు,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిజ్య పరిశ్రమల సంఘం సేవలు అపూర్వం: మేయర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీష్ ,ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం సేవలు మరువలేనివని నగర మేయర్ ముల్లంగి నందీష్ అన్నారు. జిల్లావాణిజ్య పరిశ్రమలసంస్థ నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని మేయర్ ముల్లంగి నందీష్, జిల్లా ఎస్పీ శోభ రాణి సంయుక్తంగా సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులతో పాటు సామాన్య ప్రజలకు కూడా సేవలందిస్తుందన్నారు. ఈ సంస్థ సర్వతోముఖాభివృద్ధికి కార్పోరేషన్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. సంస్థ భాగస్వామ్యమయ్యే ఏ దాతృత్వ కార్యక్రమాలకైనా సహకరిస్తామని చెప్పారు. జిల్లా ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ప్రజానుకూలంగా పనిచేస్తోంది. ప్రస్తుత చైర్మన్ యశ్వంతరాజు నాగిరెడ్డి సంస్థ అభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరింత ప్రాచుర్యం పొందాలని ఆకాంక్షించారు. యశ్వంతరాజు నాగిరెడ్డి మాట్లాడుతూ బళ్లారి జిల్లా వాణిజ్య మండలి రైతు భోజనాలు, రైతు క్లినిక్‌లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించి అన్ని వర్గాల వారికి సేవలందిస్తోందన్నారు. పారిశ్రామికవేత్తలు వ్యాపారులు, పన్నుల శాఖ, జిల్లాపారిశ్రామిక కేంద్రం, రెవెన్యూ శాఖలతో సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతూ సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. ఈసందర్భంగా సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడే దొడ్డనగౌడ, సొంతగిరిధర, సంయుక్త కార్యదర్శులు మల్లాకార్జునగౌడ, రామచంద్ర, కోశాధికారి పాలన్నతో పాటు అధికారులు, సబ్‌కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు: ఎమ్మెల్యే

కంప్లి, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా మరిన్ని సౌకర్యాలు పొందేలా చూస్తామని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. కంప్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు తానే స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ సారి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మంచి ఫలితాలు సాధించేలా చూస్తామన్నారు. మల్లికార్జున, మమత, పాలమ్మ, దానప్ప, మూకయ్యస్వామి, గంగాధర, వీరాంజనేయులు, మనోహర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

బావిలో పడి
తల్లీకుమారుడి మృతి

●మలియాబాద్ గ్రామంలో విషాధం

రాయచూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి తల్లీ కుమారుడు మృతి చెందారు. రాయచూరు తాలూకాలోని మలియాబాద్ గ్రామానికి చెందిన రాధమ్మ(32) ఆమె కుమారుడు సంజు(5) మృతి చెందినవారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నీటి కోసం బావికి వెళ్లిన రాధమ్మ వెంట వెళ్లిన కుమారుడు సంజు కాలు జారి బావిలో పడ్డాడు. కుమారుడిని రక్షించే ప్రయత్నంలో రాధమ్మ బావిలోకి దిగింది. అయితే ఊపిరాడక ఇద్దరూ మునిగిపోయారు. విషయం తెలిసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారి మృత దేహాలను బయటికి తీశారు. తల్లికుమారుడి మృతితో అకస్మాత్తుగా దుర్మరణం పాలు కావడంతో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నారు.



మాట్లాడుతున్న రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవా కప్పగల్లు

నేటి నుంచి రంగతోరణ నాటకోత్సవాలు

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రంగతోరణ నాటకోత్సవాలు ఈ నెల 10,11 తేదీల్లో అటల్ బిహారి వాజ్‌పేయి నగర్ రంగతోరణ కళామంటపంలో నిర్వహించనున్నట్లు రంగతోరణ కార్యదర్శి ప్రభుదేవా కప్పగల్లు తెలిపారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కప్పగల్లుకు చెందిన రిటైర్డ్ ముఖ్యోపాధ్యాయ మెహతాబ్, నటరాజ గౌడ కట్టెగౌడ నాటకోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. వేదిక కార్యక్రమంలో సంగనకల్లు గ్రామం సీనియర్ ప్రముఖులు వి.నాగిరెడ్డి, మేఘ, సత్యనారాయణరావు, సిరుగుప్ప సామాజిక కార్యకర్త సదాశివ కౌతాల్ అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు. కళాభిమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు వీరభద్రేశ్వరస్వామి మహారథోత్సవం

సిరుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హళేకోట వీరభద్రేశ్వరస్వామి జాతర, మహారథోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండంలో నడిచి వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. ఉదయం 6 గంటలకు గ్రామ పురవీధుల్లో ఆలయం నుంచి ఎదురు బసవన్న వరకు మహా రథోత్సవం ఊరేగింపు జరుగుతుందని, భక్తులు విశేషంగా తరలివచ్చి పునీతులు కావాలని వారు కోరారు.

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

కంప్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మత్స్య కార్మికులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. సోమవారం కంప్లి వ్యవసాయ కృషిపత్తిన కేంద్రంలో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మత్స్యశాఖ కార్మికులకు కిట్టను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. మున్ముందు కూడా అన్ని సమాజాల వారికి పేద కుటుంబాల వారికి సదుపాయాలు అందేలా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీకుమార్, మత్స్యశాఖ అధికారులు శివప్ప, అభిలాషి, భావన, చిన్న రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు

కంప్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుడితిని పట్టణంలో ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏసీసీ అదానీ సంస్థ ఆధ్వర్యంలో క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టే పనులపైన, చదువుపైన వివిధ అంశాలపైన అవగాహన కల్పించారు. కుడితిని, వేణి వీరాపురం, సిద్దమ్మనహళ్లి, తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

హనుమాన్ మాలధారణ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

కంప్లి, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి) : అంజనాద్రి పర్వతంపై పలువురు భక్తులు సోమవారం హనుమాన్ మాలధారణ స్వీకరించారు. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి తదితరులు పంపా సరోవర్ వద్ద విజయలక్ష్మీకి ప్రత్యేక పూజలు నిర్వహించి, అంజనాద్రి కొండపై ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలధారులు నియమనిష్టలతో స్వామి అనుగ్రహం పొందాలని సూచించారు. మనోహర్ గౌడ, వీరేష్, సంగమేష్, ఎమనూరచౌడికి, పంపన్ననాయక్, శరణప్ప, మల్లికార్జున స్వామి, బాబు, గంగాధర స్వామి, రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో రూ.కోట్లు దోచేశారు..

అవినీతిపై విచారణ జరిపించాలి: కార్పొరేటర్ ఇబ్రహీం బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇబ్రహీంబాబు

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర కార్పొరేషన్‌లో అవినీతి రాజ్యమేలుతోందని, నకిలీ బిల్లులతో రూ.కోట్లు కాజేశారని 13వ వార్డు కార్పొరేటర్ ఇబ్రహీంబాబు ఆరోపించారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ రశీదులతో ఇంటి పన్నుల వసూళ్లలో భారీ గోల్‌మాల్ జరిగిందన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో నకిలీబిల్లులు పంపిణీకి ఆధారాలు లభించాయన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోహర్, బిల్ కలెక్టర్ శ్రీనివాసులను సస్పెండ్ చేశారు. అధికారులను సస్పెండ్ చేస్తేనే సరిపోదన్నారు. రూ.45 కోట్ల పన్నుల్లో ఫేక్ బిల్లులతో ఈ ఏడాది రూ.35కోట్లు వసూలు చేశారన్నారు. నగరంలో మూడుజోన్లు ఉండగా ఒక్కో జోన్‌లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అవినీతిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సభ్యులు శ్రీనివాస్ మోత్కార్, సురేఖ మల్లనగౌడ్ , హనుమంతు, గోవిందరాజులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దోచేసి.. తోసేశారు..!

బళ్లారి గాంధీనగర్/రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మోకా పోలీసు స్టేషన్ పరిధిలో తుంగభద్ర లో లెవల్(ఎల్లెల్సీ) 115/100 కిలోమీటరు వద్ద సోమవారం ఉదయం కెనాల్‌లోకి దూసుకెళ్ళింది. ఆదివారం బళ్లారి తాలూకా పరిధిలోని మినిరా స్పాంజ్ ఐరన్ కంపెనీ నుంచి హైదరాబాద్‌లోని స్టీల్ ఫ్యాక్టరీకి స్పాంజ్ ఐరన్‌ను తీసుకెళుతున్న కేఏ34, సీ-8914 నెంబరు గల లారీ కెనాల్ కుడివైపుకు కెనాల్‌లో దూసుకెళ్ళింది. విషయం తెలుసుకున్న మోకా ఎస్ఐ ఎ.కాళింగ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనా కాలువలోకి లారీ ప్రమాద వశాత్తు దూసుకెళ్ళలేదని, లారీ డ్రైవర్ కావాలనే మైనింగ్ లోడ్‌తో ఉన్న లారీ డ్రైవర్ ఎల్లెల్సీ కాలువ వైపు తిప్పి లారీ నుంచి దూకి ఉంటాడని ప్రాథమికంగా బావిస్తున్నారు. అయితే లారీ ఓనర్ ఘటనపై మాట్లాడుతూ, నగరానికి చెందిన ఓ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఆదివారం రాత్రి మినిరా స్పాంజ్ ఐరన్ కంపెనీ నుండి సుమారు 40టన్నుల స్పాంజ్ ఐరన్‌ను హైదరాబాద్‌కు పంపింనట్లు తెలిపారు. ఘటనా జరిగిన స్థలంలో లారీలో ఉండాల్సిన స్పాంజ్ ఐరన్ సగానికి పైగా తగ్గిందని, బహుషా లారీ డ్రైవర్ లారీలో ఉన్న స్పాంజ్ ఐరన్‌ను అమ్ముకున్నాడా... లేదా మరేమైనా జరిగిందా అనే విషయం లారీ డ్రైవర్ ఆచూకీ తెలిస్తే తప్పా తెలియదన్నారు. ఉదయం నుంచి ఎల్లెల్సీలో పడిని లారీని క్రైన్‌ల సహాయాయం తో బయటకుతీసే ప్రయత్నం చేసినా ఫలించలేదు.



లారీని క్రైన్లతో బయటికి తీస్తున్న దృశ్యం

హొసూరు జోన్

పాఠశాలకు స్టేషనరీ అందజేత



ఉపాధ్యాయులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న నాయకులు

హొసూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ 78వ పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ మైనారిటీశాఖ ఆధ్వర్యంలో సోమవారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాదిక్‌ఖాన్ అధ్యక్షత వహించారు. రాంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు రాతసామగ్రి, నోటు పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర సమన్వయకర్త ఎస్ అక్బర్, నీలకంఠన్, బత్తలపల్లి నాగరాజు, కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి సూర్యగణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సమీర్, మున్సిపల్ అధ్యక్షుడు సాదిక్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు బైరోస్ పాల్గొన్నారు. అదే విధంగా ప్రభుత్వాసుపత్రిలో 200 మంది గర్భిణీలు, చిన్నారులు, రోగులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధరన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధ్యక్షుడు త్యాగరాజన్ నేతృత్వంలో బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. షైజా అక్బర్, నగర కార్యదర్శి త్యాగరాజన్, ఇర్షాద్, జిల్లా అధ్యక్షుడు కార్తీ, ఎల్లప్ప, కాంగ్రెస్ సభ్యులు ప్రకాశం, వెంకటేశ్, వసంత్, వికి పలువురు జిల్లా మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులపై రైతుల అభ్యంతరం

హొసూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలోని కెలవరపల్లి ఆనకట్ట నుంచి దక్షిణాపినాకిని నది వద్ద అలియాళం ఆనకట్ట కుడికాలువ ప్రాజెక్టు చేపట్టడాన్ని రైతు సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును ప్రత్యామ్నాయ మార్గంలో అమలు చేయాలని కోరింది. ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకోవడం ద్వారా రైతుల జీవనోపాధి దెబ్బతింటోందన్నారు. సమస్యను సమగ్రంగా వివరిస్తూ హొసూరు సబ్‌కలెక్టర్‌కు రైతుసంక్షేమసంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మణి మాట్లాడుతూ ప్రాజెక్టుపై పలుమార్లు నిరసనలు చేశామన్నారు. సుమారు 800మంది రైతులకు జీవనాధారమైన భూములు ఇవ్వబోమని, దీని వల్ల 126 ఎకరాలకు పైగా సాగుభూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రత్యామ్నాయ మార్గంలో పనులు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటిన సహానా

● అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకం



పతకాలతో బేబి సహనా

హొసూరు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా టేబుల్ టెన్నిస్ పోటీల్లో హొసూరుకు చెందిన బేబి సహనా(20) బంగారుపతకం సాధించి సత్తా చాటింది. ఈ నెల 1 నుంచి 7 వ తేది వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పాల్గొని సింగిల్స్ విభాగంలో బంగారు పతకం, డబుల్స్ విభాగంలో రజత పథకం సాధించి మన భారతదేశానికి, తమిళ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. ప్రస్తుతం నోయిడాలోని అమిటీ యూనివర్శిటీలో ఆన్‌లైన్‌లో బిఏ ఇంగ్లీష్ లిటరేచర్ కోర్సు చేస్తున్నారు. హొసూరు నగరంలోని టీవీఎస్ సంస్థలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న రవి, సెల్వలక్ష్మి దంపతుల రెండో కుమార్తె సహనా. ఆమె 4వ తరగతి నుంచే టేబుల్ టెన్నిస్ ఆడటం ప్రారంభించారు. 2016లో 12 ఏళ్ల వయస్సుల్లో టేబుల్ టెన్నిస్‌ల్లో గోల్డ్ మెడల్‌తో జాతీయ ఛాంపియన్‌షిప్‌ను సాధించారు. 13వ యేట జోర్డాన్‌ల్లో జరిగిన పారా ఇంటర్నేషనల్‌స్థాయి టేబుల్ టెన్నీస్ టోర్నమెంట్‌ల్లో రజత పతకాన్ని గెలుచుకున్నారు. 2016 నుంచి 2024 వరకు జరిగిన ఇండియన్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లలో 12 బంగారు పతకాలను గెలవడమే కాక వరుసగా 8 సంవత్సరాలు జాతీయ ఛాంపియన్‌గా ఉన్నారు. అదేవిధంగా కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్నందుకు భారత ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు పొందారు. డీసీఎం ఉదయనిధి స్టాలిన్ రూ.2 లక్షలు బహూకరించారు. వరల్డ్ స్కిల్ యూత్ గేమ్స్‌లో విజేతగా నిలవడం హర్షణీయమన్నారు. అలాగే 2028లో అమెరికాలో జరగనున్న పారాలింపిక్స్‌ల్లో టేబుల్ టెన్నీస్‌ల్లో ప్రథమస్థానం సాధించడమే తన తదుపరి లక్ష్యమని తెలిపారు. ఎన్నో విజయాలు సాధించిన యువ మహిళా క్రీడాకారిణిని పలువురు ప్రశంసలతో అభినందించారు.

ఒంటరి ఏనుగు సంచారం.. హెచ్చరికలు

హొసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హొసూరు శూలగిరి తాలూకా పరిధిలోని ఎ.శెట్టిపల్లి అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తోందని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. శూలగిరి అటవీ ప్రాంతంలోని గుండగుర్కి, ఎళసేపల్లి, కానలట్టి, కొరగుర్కి, శెట్టిపల్లి, అగొండపల్లి, కొట్టాంగిరి, అగొండపల్లి, పావనపల్లి, పట్టాకురుబరపల్లి తదితరగ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో వ్యవసాయ నిమా కోసం పొలాలవైపు వెళ్ల రాదని, పశువులను మేపేందుకు గానీ, కట్టెలు సేకరించడానికి కూడా వెళ్లరాదని అటవీశాఖాధికారులు సూచించారు.



అడవిలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాయచూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న బైక్ అదుపు తప్పి పడిపోవడంతో బైక్ నడుపుతున్న యువకుడు దుర్మరణం పాలైన సంఘటన సోమవారం ఉదయం జిల్లాలోని మాన్వి పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. మృతి చెందిన యువకుడు హుణసిహాళహుడా గ్రామానికి చెందిన సిద్ధలింగ(26)గా గుర్తించారు. బైక్ పై వెనక కూర్చున్న మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా సిద్ధలింగ మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మాన్వి పోలీసులు కేసు నమోదు చేశారు.



సిద్ధలింగ(ఫైల్)